సాక్షి
చిత్తూరు
బుధవారం । 27 । సెప్టెంబర్ । 2023



రేపటి నుంచి ప్రత్యేక ఉత్సవాలు

కాణిపాకం వినాయకస్వామి ఆలయంలో గురువారం నుంచి ప్రత్యేక ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. - 8లో



ముగిసిన పైలెట్ హెల్త్ క్యాంపు

పేదల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన పైలెట్ హెల్త్ క్యాంపు మంగళవారం ముగిసింది. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	34	24
తిరుపతి	35	25
తిరుమల	29	21
గూడూరు	36	27
నగరి	35	25

న్యూస్‌రీల్

బాలల హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయమూర్తి కరుణకుమార్

చిత్తూరు కలెక్టరేట్ : బాలల హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ తెలిపారు. మంగళవారం చిత్తూరు పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమ పథకాలు, బాల కార్మికుల నిషేధ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ బాలల హక్కులకు ఎవరైనా భంగం కలిగించినా, వారిని పనిలో పెట్టుకున్నా కఠినమైన చర్యలుంటాయన్నారు. 1986లో బాల కార్మిక చట్టం అమల్లోకి వచ్చిందని వెల్లడించారు. ఈ మేరకు 14 ఏళ్లలోపు పిల్లలను పనిలో నియమించడం నేరమని స్పష్టం చేశారు. జిల్లా కార్మిక శాఖ కమిషనర్ ఓంకార్‌రావు మాట్లాడుతూ పిల్లల చేత పనులు చేయిస్తే సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేయడంతోపాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పిల్లల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ తులసి, డీఈఓ విజయేంద్రరావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి, వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి, దిశ ఎస్‌ఐ నాగసౌజన్య, పాల్గొన్నారు.

నేడు వెదురుకుప్పంలో 'జగనన్నకు చెబుదాం'



కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం బుధవారం వెదురుకుప్పంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

నేడు పలమనేరులో జాబ్‌మేళా

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖరరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పలమనేరులోని ఎస్‌వీసీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే జాబ్‌మేళాలో 3 బహుళజాతి కంపెనీలు పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఉద్యోగానికి ఎంపికైన వారికి నెలకు కనీస జీతం రూ.14,400 నుంచి రూ.30,200 వరకు ఉంటుందని వివరించారు. ఇతర వివరాలకు 8465830771,7780599208 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.


మెడికల్ డిప్లొమా కోర్సులకు కౌన్సెలింగ్



కౌన్సిలింగ్‌కు హాజరైనా విద్యార్థులు

చిత్తూరు రూరల్: నగరంలోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం 16 మెడికల్ డిప్లొమా కోర్సులకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి 600 మందికి పైగా విద్యార్థులు హాజరైనట్లు వెల్లడించారు. మెరిట్ ఆధారంగా సర్టిఫికెట్లను పరిశీలించినట్లు వివరించారు. కార్యక్రమంలో వైద్యఆరోగ్యశాఖ అధికారులు నాగేశ్వరరావు, విజయబాబు, రూప్‌కుమార్ ధరణి, సెల్వం పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్లలో ఫిర్యాదుల రిజిస్ట్రేషన్



మాట్లాడుతున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ సమస్యల నమోదుపై సబ్‌స్టేషన్లలో ఫిర్యాదుల రిజిస్ట్రేషన్ ప్రవేశపెట్టనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం చిత్తూరు అర్బన్ ఈఈ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సెక్షన్ పరిధిలో లైన్ కిందకు వేలాడటం, కొమ్మలకు తీగలు అల్లుకోవడం తదితర సమస్యలను అందులో నమోదు చేసి పరిష్కారించాలన్నారు. ఫిర్యాదు ప్రదేశంలో ప్రమాదం జరిగితే సంబంధిత ఏఈ, లైన్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్తు సమస్యలపై ప్రజలు 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని సూచించారు. జిల్లాలోని 33 కేవీ ఫీడర్లు, 11 కేవీ ఫీడర్ల నిర్వహణ కోసం రూ.7.45 కోట్లతో 24 బ్రేకర్లను ఆయా సబ్‌స్టేషన్లలో ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో 34 సబ్‌స్టేషన్లను మార్చిలోపు ప్రారంభించనున్నట్లు వివరించారు. జగనన్న కాలనీల్లో విద్యుద్దీకరణ పనులు శరవేగంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. సకాలంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఈఈలు హరి, పద్మనాభపిళ్లై, డీఈలు సతీష్, శేషాద్రి, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

పవిత్రం..పునీతం

ఆహా.. ఇది కదా భాగ్యము.. శ్రీహరిని స్పృశించిన మలయ మారుతం మము తాకగా.. సుదర్శనుని అభిషేకించిన పవిత్ర తీర్థంలో పుణ్యస్నానమాచరింపగా.. ఉభయ దేవేరీ సమేతంగా కొలువుదీరిన మలయప్పస్వామిని సేవింపంగా.. మా జన్మ చరితార్థమైందని భక్తజనులు పరవశించారు. సుమనోహర విశేష సుమ మాలలు ధరించిన దేవదేవేరులను వీక్షించి పునీతులయ్యారు. బ్రహ్మోత్సవాలను పరిపూర్ణం చేస్తూ నిర్వహించిన ధ్వజావరోహణ ఘట్టంలో పాలుపంచుకుని పులకించారు.

- శాస్త్రోక్తంగా శ్రీవారి చక్రస్నానం
- పుష్కరిణికి పోటెత్తిన భక్తజనం
- ఆగమోక్తంగా ధ్వజావరోహణం
- శ్రీవారి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

తిరుమల : శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం ఉదయం చక్రస్నానం కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీవారి పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అంతకుముందు తెల్లవారుజామున 3 నుంచి 6 గంటల వరకు స్వామివారికి పల్లకీ ఉత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం 6 నుంచి 9 గంటల మధ్య శ్రీ భూవరాహ స్వామి ఆలయ ముఖమండపంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపనతిరుమంజనం జరిపించారు. విశేష అభిషేకాలనంతరం వివిధ పాశురాలను పెద్ద జీయ్యంగార్, చిన్న జీయ్యంగార్లు పఠించారు. ఈ వేడుకలో ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమ జాతి పుష్ప మాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. సాయంత్రం ధ్వజావరోహణ కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహించారు. దీంతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణమైనట్టు టీటీడీ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమాలలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఈఓ ఏవీ.ధర్మారెడ్డి దంపతులు, కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, జేఈఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, ఎస్పీ పరమేశ్వర రెడ్డి, సీవీఎస్వో నరసింహకిషోర్ తదితరులు పాల్గొన్నారు.





తిరుమల శ్రీవారి చక్రస్నానానికి హాజరైన అశేష భక్తజనం (ఇన్‌సెట్) సుదర్శన చక్రత్తాళ్వార్‌ను పవిత్ర జలాల్లో ముంచి లేపుతున్న అర్చకులు



చక్రస్నానంలో టీటీడీ చైర్మన్ భూమన, ఈఓ ధర్మారెడ్డి



శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప



ధ్వజావరోహణం



స్నపన తిరుమంజనం

వైభవం.. వరసిద్ధుని సంబరం

- గణపతికి శాస్త్రోక్తంగా క్షీరాభిషేకం
- కనులపండువగా కల్యాణోత్సవం
- అశ్వవాహనంపై దేవదేవుని విహారం
- మొక్కులు చెల్లించుకున్న భక్తజనం



కర్పూర హారతి సమర్పిస్తున్న అర్చకుడు



భిక్షాండిలో ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి



క్షీర కలశాలతో వస్తున్న గాండ్ల కులస్తులు



క్షీరాభిషేకరం నిర్వహిస్తున్న అర్చకుడు

కాణిపాకం(యాదమరి) : కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి సిద్ధి, బుద్ధి సమేతంగా వినాయకస్వామి అశ్వవాహనంపై పురవీధుల్లో విహరించారు. మేళ తాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటలు, చెక్కభజనల నడుమ ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. బొమ్మసముద్రం, తిరువణంపల్లె, చింతమాకుల పల్లె, కారకాంపల్లె గ్రామాలకు చెందిన గోనుగుంట, బలిజ వంశీయులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు.

ఆనవాయితీగా నిలువు దోపిడీ

ఉభయదేవేరీలతో కూడిన గణనాథునికి కనులపండువగా కల్యాణోత్సం నిర్వహించారు. అనంతరం ప్రారంభమైన అశ్వావాహన సేవలో గంగుంద్ర మండపం వద్ద ఆనవాయితీ ప్రకారం స్వామివారు నిలువు దోపిడీకి గురయ్యారు. స్వామి ఆభరణాలు, నైవేద్యం, అత్తవారు కట్టించిన కుడుములు, ఉండ్రాళ్లు, చిల్లర, కాసులను దొంగలు దోపిడీ చేసే ఘట్టం జరిపించారు.

శతకలశ క్షీరాభిషేకం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం కల్యాణోత్సవ మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి అష్టోత్తర శతకలశ క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వణిగ , గోనుకుంట బలిజ వంశస్తులు వేర్వేరుగా క్షీర కలశాలతో తీసుకువచ్చి ఆలయంలో అందజేశారు.

శివపార్వతుల భిక్షాటన

కల్యాణోత్సవం సందర్భంగా సాయంత్రం భిక్షాండి కార్యక్రమం నిర్వహించారు. కల్యాణానికి వస్తు సామగ్రిని సమకూర్చుకోవడానికి శివపార్వతులు గ్రామంలో భిక్షాటన చేయడం ఆనవాయితీ.

టీటీడీ తరపున పట్టు వస్త్రాల సమర్పణ

బ్రహ్మోత్సవాల సందర్భంగా వినాయకస్వామికి టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ మేరకు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం పట్టు వస్త్రాలు అందజేశారు.

నేటితో పరిపూర్ణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం ధ్వజావరోహణం, అభిషేకం , రాత్రి వడాయత్తు ఉత్సవం, ఏకాంత సేవ నిర్వహించనున్నారు. ఈ మేరకు గణనాథుని బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం కానున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఉభయదారుడు రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం దంపతులు



క్షీర కలశాలతో ఊరేగింపుగా వస్తున్న బలిజ కులస్తులు



స్వామివారి అభిషేకానికి హాజరైన భక్తులు

మైనర్ బాలికది హత్య కాదు!

- ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు
- వాస్తవాలను వక్రీకరిస్తే సహించం
- ఏఎస్పీ శ్రీలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాసమూర్తి స్పష్టీకరణ


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ శ్రీలక్ష్మి

చిత్తూరు అర్బన్: గంగాధర నెల్లూరు నియోజకవర్గం పెనుమూరు మండలంలో ఇటీవల జరిగిన మైనర్ బాలిక మృతి ఘటనపై సామాజిక మాధ్యమాల్లో ఇష్టానుసారం కథనాలు అల్లడంపై జిల్లా పోలీసుశాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు మైనర్ బాలిక ఫొటోలు, పేర్లు పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో పదే పదే ప్రస్తావించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. మరోసారి బాలిక పేరు, ఫొటోలు ప్రచురించినా.. అవాస్తవాలు ప్రచారం చేసినా, సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు వండి వార్చినా క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించింది. ఈ మేరకు మంగళవారం చిత్తూరులోని పోలీసు అతిథిగృహంలో ఎస్‌ఈబీ ఏఎస్పీ శ్రీలక్ష్మి మీడియా సమావేశం నిర్వహించారు. చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి, దిశ సీఐ బాలయ్య, పెనుమూరు ఎస్ఐ అనిల్‌కుమార్‌తో కలిసి ఇప్పటి వరకు కేసులో చోటు చేసుకున్న పరిణామాలు, తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్న అనుమానాలు, కొందరు వ్యక్తులు ట్రోల్ చేస్తున్న ఆరోపణలకు సమాధానాలిచ్చారు.

- పెనుమూరుకు చెందిన 16 ఏళ్ల బాలిక ఇంటర్ చదువుతోంది. ఈనెల 17వ తేదీ సాయంత్రం నుంచి ఆమె కనిపించడంలేదని తల్లితండ్రులు 18వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసిన ఎస్ఐ అనిల్‌కుమార్ వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ఫుటేజీల పరిశీలనతోపాటు, బాలిక స్నేహితులను విచారించారు.
- 20వ తేదీ రాత్రి గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు గ్రామ శివార్లలోని బావి వద్దకు స్థానికులు వెళ్లగా అందులో బాలిక మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. తప్పిపోయిన బాలికగా గుర్తించారు. మిస్సింగ్ కేసును అనుమానాస్పద మృతిగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.
- బాలిక మృతిపై తల్లిదండ్రుల అనుమానం మేరకు నలుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. బాలిక కుటుంబ సభ్యులు, అనుమానితుల ఫోన్ కాల్స్ డేటాను సేకరించి, విశ్లేషించారు.
- మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. 21వ తేదీన శవపరీక్ష చేయించారు.
- బాలికపై శరీరంపై ఎక్కడా చిన్నపాటి గాయం లేదు. గొంతుకు తాడు బిగించిన ఆనవాళ్లు లేవు. అయినప్పటికీ విషప్రయోగం కానీ, లైంగికదాడి ఏమైనా జరిగి ఉండవచ్చనే అనుమానంతో కాలేయం, ఇతర అవయవాలతోపాటు స్వాబ్స్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు.
- బాలికపై లైంగికదాడి చేసి, గుండుకొట్టి చంపి పడేశారని వచ్చిన ఆరోపణలను అవాస్తవమని తెలుసుకున్నారు. బావిలోని నీరు మొత్తం తోడేసిన తర్వాత బాలిక తలవెంట్రుకలు అందులోనే పడి ఉండటాన్ని గుర్తించారు.
- బాలికను ఎక్కడైనా చంపి బావిలో పడేశారా..? అనే అనుమానంపై ఆమె ఎముకల నుంచి నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. తల వెంట్రుకలను డీఎన్ఏ పరీక్షలకు సైతం తరలించారు. బాలిక ఊపిరితిత్తుల్లో ఉన్న నీళ్లు, బావిలోని నీళ్ల శ్యాంపిల్స్‌ను సైతం ల్యాబ్‌కు పంపారు.
- శవ పరీక్ష, తల వెంట్రుకలు ఊడిపోవడం, మృతదేహంపై ఎలాంటి గాయాలు లేకపోవడం అనే వైద్యుల నివేదిక ఆధారంగా బాలికది హత్య కాదని ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు పోలీసులు స్పష్టం చేస్తున్నారు.
- ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికలను ఎప్పటికప్పుడు మీడియాకు తెలియచేస్తామని.. అందులో బాలికను హత్య చేసినట్లు చిన్నపాటి ఆధారం వచ్చినా నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

మాజీ సైనికులకు అవగాహన సదస్సు


మాట్లాడుతున్న విజయశంకర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పరిశ్రమల కేంద్రంలో మంగళవారం మాజీ సైనికులకు ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకంపై అవగాహన కల్పించారు. పరిశ్రమల శాఖ ఏడీ కృష్ణకిషోర్ మాట్లాడుతూ ఇండస్ట్రీ పాలసీ, స్వయం ఉపాధి పథకాలు, సబ్సిడీ వివరాలు తెలియజేశారు. అనంతరం పశుసంవర్థకశాఖ డీడీ డాక్టర్ అరీఫ్ నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం గురించి తెలియజేశారు. స్వయం ఉపాధి పథకాలపై మాజీ సైనికులు సందేహాలను నివృత్తి చేశారు. జిల్లా సైనిక సంక్షేమాధికారి విజయశంకర్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ సైనికులకు ఉపాధి కల్పించేందుకు ఇలాంటి సదస్సులు ఉపయోగపడతాయని తెలిపారు.

వరసిద్ధునికి వెండి విభూది పట్టీ


విభూది పట్టీని విరాళంగా అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి):కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామికి చంద్రగిరికి చెందిన దాత మురళి ఆచ్చారి వెండి విభూది పట్టీని వితరణగా అందించారు. మంగళవారం రాత్రి దాత కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేసి రూ.60వేల విలువైన 450 గ్రాముల వెండితో తయారు చేసిన విభూది పట్టీని ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కు అందజేశారు.

మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం


మాట్లాడుతున్న ఎస్‌ఈబీ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్ : మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎస్‌ఈబీ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం మురకంబట్టులోని సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తుపదార్థాలకు అలవాటు పడితే జీవితం నాశమవుతుందని వెల్లడించారు. ప్రిన్సిపల్ వెంకటచలపతి మాట్లాడుతూ యువత సమాజానికి ఆదర్శంగా ఉండాలని కోరారు. మత్తుకు దూరంగా ఉంటేనే జీవితంలో ఉన్నతమైన స్థానానికి చేరుకోగలరని తెలిపారు. కార్యక్రమంలో సెబ్ సీఐ జోగేంద్ర, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ యోగప్రసాద్, డీన్ శరవణన్ పాల్గొన్నారు.

28న మిలాద్ ఉన్ నబీ సెలవు

చిత్తూరు కలెక్టరేట్ : మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకుని ఈ నెల 28వ తేదీన ప్రభుత్వం సెలవు ప్రకటించింది. మంగళవారం ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. మైనారిటీ ఉద్యోగుల సంఘం, ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ వినతి మేరకు సెలవు ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు.

అక్టోబర్ 3న అర్చక, అధికారుల సమావేశం

చిత్తూరు రూరల్: జిల్లా దేవదాయశాఖ పరిధిలోని అర్చక, అధికారుల సమావేశాన్ని అక్టోబర్ 3వ తేదీన నిర్వహించనున్నట్లు అర్చకుల సంఘం నాయకులు వేణుగోపాల్, సుధాకర్ గురుక్కల్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ చిత్తూరు పొన్నియమ్మగుడివీధిలోని శ్రీవీరాంజనేయస్వామి కల్యాణ మండపంలో సమావేశం ఉంటుందని వెల్లడించారు. అర్చకుల సమస్యలు, జీతభత్యాలు, పడితరం తదితరాలపై చర్చించనున్నట్లు వివరించారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.59,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,000
రిటైల్ వెండి గ్రాము	రూ.75.00

ఘనంగా యువజనోత్సవాలు


మాట్లాడుతున్న సీఈఓ మురళీకృష్ణ


కళాకారులు జానపద నృత్యం

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జిల్లా స్థాయి యువజనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానందుని చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యఅతిథి సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ మాట్లాడుతూ యువతోని సృజనాత్మకతను వెలికితీసేందుకు యువజనోత్సవాలు ఉపయోగపడతాయన్నారు. కళలు, కళాకారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. డీఈఓ విజయేంద్రరావు మాట్లాడుతూ భారత కీర్తి ప్రతిష్ఠలను తన ప్రసంగాల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పిన స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ తులసి మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఆధునిక యుగంలో అంతరించిపోతున్న ప్రాచీన కళలకు ప్రభుత్వం ప్రాణం పోస్తోందని తెలిపారు. పీవీకేఎన్ ప్రిన్సిపల్ జీవనజ్యోతి మాట్లాడుతూ వివేకానందుని స్ఫూర్తితో యువత చదువుతో పాటు సాంస్కృతిక రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు ప్రాంతాల నుంచి హాజరైన యువ కళాకారులు ప్రదర్శించిన జానపదనృత్యాలు, గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో యువజన సర్వీసుల శాఖ మేనేజర్ మోహన్ పాల్గొన్నారు.

కుప్పంలో గేటు వసూళ్ల రద్దు

- చిరువ్యాపారుల తరఫున నగదు చెల్లించిన ఎంపీ మిథున్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎంపీ రెడ్డప్ప

కుప్పం : పట్టణంలోని చిరువ్యాపారులు మున్సిపాలిటీకి గేటు చెల్లించాల్సిన అవసరం లేదని, దీన్ని పూర్తిగా రద్దు చేశామని ఎంపీ రెడ్డెప్ప వెల్లడించారు. మంగళవారం ఎమ్మెల్సీ భరత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు పక్కన తోపుడు బండ్లు, కూరగాయలు, పూలు, పండ్లు, చిన్నపాటి వస్తువులు విక్రయించుకునేవారికి గేటు భారం తప్పించినట్లు తెలిపారు. చిరువ్యాపారుల తరఫున ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సొంత నిధులను కుప్పం మున్సిపాలిటీకి చెల్లించినట్లు వివరించారు. ఈ మేరకు గేటు చెల్లిస్తున్న వ్యాపారులకు పురపాలక అధికారుల ద్వారా గుర్తింపు కార్డులు అందించనున్నట్లు చెప్పారు. పార్టీలకు అతీతంగా చిరువ్యాపారులకు సాయం అందించాలని ఎంపీ మిథున్‌రెడ్డి నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎంపీ నిధులు కేటాయించామని తెలిపారు. అలాగే మున్సిపల్ కార్యాలయం ఎదురుగా రూ.50 లక్షలతో కాంప్లెక్స్, రూ.25లక్షలతో మూడో సచివాలయ భవనం, రూ.15లక్షలతో మార్కెట్ యార్డు ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. కుప్పం వాసుల దాహార్తిని తీర్చేందుకు హంద్రీ–నీవా కాలువ పనులు శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు. మూడు నెలలల్లో కృష్ణా జలాలను కుప్పానికి తీసుకువస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుధీర్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

ముగిసిన పైలెట్ హెల్త్ క్యాంపు

చిత్తూరు రూరల్: పేదల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో చేపట్టిన పైలెట్ హెల్త్ క్యాంపు మంగళవారంతో ముగిసింది. ఈ నెల 15వ తేదీ నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. పదిరోజులుగా సర్వే వేగవంతంగా చేస్తున్నారు. ఈ సర్వేలో ఇప్పటివరకు వైద్య బృందం 2,82,968 కుటుంబాల తలుపుతట్టారు. ఈ కుటుంబాల్లోని 7,16,245 మందిని సర్వే చేశారు. వీరిలో 2,87,104 మందికి బీపీ, 2,57,843 మందికి మధుమేహం, 2,56,491 మందికి హెచ్‌బీ, 4,038 మందికి యూరియన్, 3, 518 మందికి మలేరియా, 2,671 మందికి డెంగీ, 2,772 స్పుటమ్ పరీక్షలు చేశారు. కాగా ఇప్పటి వరకు 5,32,562 మందికి టోకన్లు అందజేశారు. వీరంతా మెగా హెల్త్ క్యాంపు రావాలని సూచిస్తున్నారు. ఈనెల 30వ తేదీ నుంచి మెగా వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలోని బంగారుపాళెం మండలం తుంబకుప్పం పీహెచ్‌సీ పరిధిలోని తిమోజీపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం హెల్త్ క్యాంపు నిర్వహించింది. అలాగే తిరుపతి రూరల్‌లోని దామినేడు పీహెచ్‌సీ మల్లవరం పీహెచ్‌సీలో విజయవంతంగా శిబిరం పూర్తి చేశారు.

పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్‌లు


మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. మంగళవారం ఈ మేరకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో క్లబ్‌లు ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. 8, 9వ తరగతి విద్యార్థులను ఈ క్లబ్‌లో భాగస్వాములను చేసి, వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో డీఎస్ఓ శంకరన్, జిల్లా సైన్స్ అధికారి వెంకటరమణ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు యాదమరి విద్యార్థిని


సితశ్రీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

యాదమరి: మధ్యప్రదేశ్‌లోని విదిషలో అక్టోబర్ 3 నుంచి నిర్వహించనున్న జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు యాదమరి ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గిరిరాజా, పీడీ రవి తెలిపారు. మంగళవారం ఈమేరకు పోటీలకు ఎంపికైన విద్యార్థిని సితశ్రీని ఘనంగా సన్మానించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పలమనేరు : పట్టణంలోని కిట్టన్న మిషన్ ప్రాంతంలో మంగళవారం గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.21వేల విలువైన 1.5కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సీఐ చంద్రశేఖర్ కథనం మేరకు.. గంజాయి విక్రయాలపై సమాచారం అందడంతో దాడులు నిర్వహించగా కిట్టన్న మిషన్ ప్రాంతానికి చెందిన ఎస్ఎస్ జాఫర్ అలియాస్ అయాన్(29), జగన్ అలియాస్ జగ్గ(39)లతో పాటు ఓ మైనర్ బాలుడు పట్టుబడినట్లు వెల్లడించారు. వీరు గతంలో కూడా గంజాయి కేసుల్లో ఉన్నారని, బెయిల్‌పై వచ్చి మళ్లీ వ్యాపారంలోకి దిగినట్లు తెలిపారు. నిందితులకు గంజాయి సరఫరా చేస్తున్న మరో వ్యక్తిపై కూడా కేసు నమోదు చేసినట్లు వివరించారు. దాడిలో ఎస్ఐ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

లడ్డూ @ రూ.3లక్షలు


లడ్డూ అందిస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్ : చిత్తూరులోని డీఐ రోడ్డులో కొలువుదీరిన వినాయకుని చేతిలోని లడ్డూకు భారీ ధర పలికింది. నిర్వాహకుడు కన్నన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వేలంలో స్థానిక తేనెబండకు చెందిన వన్నెకుల క్షత్రియ సంఘం సభ్యుడు జగ్గా రూ.3లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి చేతులమీదుగా లడ్డూ అందుకున్నారు. గత ఏడాది సైతం జగ్గానే రూ.లక్షకు పైగా వెచ్చించి లడ్డూ పాడుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వలంటీర్లకు దరఖాస్తులు

తిరుపతి అర్బన్: జిల్లాలో ఖాళీగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆమేరకు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు నోటిఫికేషన్ ఇవ్వాలని చెప్పారు. బుధవారం నుంచి అక్టోబర్ 9వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 10వ తేదీ ఇంటర్వ్యూలు, 11 సెలెక్షన్, 12న జాయినింగ్ ఉంటుందని పేర్కొన్నారు.

రేపటి నుంచి కాణిపాకంలో ప్రత్యేక ఉత్సవాలు


కాణిపాకం వినాయక స్వామి ఆలయం

- సర్వం సిద్ధం చేసిన ఆలయ అధికారులు
- నేటితో ముగియనున్న నవరాత్రి బ్రహ్మోత్సవాలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి ధ్వజావరోహణంతో ముగియనున్నాయి. గురువారం ఉదయం నుంచి స్వామివారి ప్రత్యేక ఉత్సవాలను శాస్త్రోక్తంగా ప్రారంభించనున్నారు. అక్టోబర్ 8వ తేదీ వరకు కొనసాగనున్న ఉత్సవాల్లో సిద్ధి, బుద్ధి సమేతంగా వినాయక స్వామి పలు వాహనాల్లో ఊరేగనున్నారు.

ఏర్పాట్లు పూర్తి

ప్రత్యేక ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. 14 గ్రామాలకు చెందిన ఉభయదారుల ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవాలు కావడంతో వారికి సకల సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ ఉత్సవాల్లో కూడా భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు యథావిధిగా ఉంటాయని వెల్లడించారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు నిత్యాన్నదానం కొనసాగుతుందని వివరించారు.

వాహన సేవల వివరాలు

28వ	తేదీన నంది వాహనం
29న	రావణబ్రహ్మ వాహనం
30న	యాళివాహనం
అక్టోబర్	
01వ	తేదీన విమానోత్సవం
2న	సూర్యప్రభ వాహనం
3న	చంద్రప్రభ వాహనం
4న	కామధేను వాహనం
5న	కల్పవృక్ష వాహనం
6న	పూలంగి సేవ
07	పుష్పపల్లకి సేవ
08న	తెప్పోత్సవం